# దారపుండ అయిపోయింది

– శింగిసెట్టి సంజీవరావు



**వ్యాపారం**, వ్యవసాయం కళింగకు వలస వెళ్ళగా కోమటి కుటుంబాలకు అక్కడి బ్రాహ్మల నీచుతిండి అలవడింది అయినా– తెలుగులకు దగ్గరగా వున్న మలిశెట్టి వారింటి గడప సందడి చేస్తోంది. ఆ రోజు పెళ్లి ఆదుర్దాతో ద్వారానికి పై తోరణం పురితాడు పచ్చని మామిడాకుల్ని తొడుక్కుని అన్ని తలలూపి 'సై' అంటోంది. వాకిట పందిరి పై కొమ్మలు రెమ్మలు వచ్చి పోయేవారిని పలకరింపు ధోరణిలో ఉన్నాయి ఎండని చల్లగా వడబోస్తూ. వందిరి రాటకేం తక్కువ, పసుపు నీళ్ళలో తానాలాడిన కొత్త గుడ్డపీక అప్పటికే పసుపుకొమ్ము, కరక్కాయ, పోకచెక్క, నాణెం మూట కట్టుకొని పాలకొమ్మ, మామిడి కొమ్మల్ని దాని నడుముకు బిగించి కట్టించుకొని మిడిసిపడుతోంది. వందిరిరాట మొదట్లో నీటి చిలకరింపుకి తడి మట్టిని ఆశ్రయించిన నవ ధాన్యాలు మొలకెత్తేందుకు వేగిరపడి నేను ముందంటే నేను ముందని గుస గుసలాడుకుంటున్నాయి. ఆ ముందు రోజే వేసిన ముహూర్తపురాటని పిల్లలు రాసుకుంటూ పరిగెడుతుంటే కితకితలవుతోంది దానికి.

"దాంతో ఏం పనర్రా మీకు" అని అమ్మలు పిల్లల్ని గదమాయిస్తే వారితో పాటు దాని మనసు సివుక్కుమంది. చిందులేసే వారికి బదులు తానే చీవాట్లు పెట్టించుకోవాలంటే పాతిపెట్టిన కారణాన దానికి కుదర్దు.

పెళ్లిపీను కళకళలాడుతోంది. కావాలని ఇటికల పేర్పుకి ఎర్రమన్నుతో అలికించుకొని వరిపిండి ముగ్గులు తెల్లగా పెట్టించుకొని తెగ మురిసి పోతోంది. నలువైపులా అమరి కూర్చున్న మృత్తిక

అవిరీళ్లు సైగలు చేసుకుంటున్నాయి కళ్యాణ ఉత్సాహంతో.

'ఏరి రారేమింకా ఆసీనులై మమ్మల్ని అను గ్రహించేందుకు' అన్నట్టు పెళ్లిపీట వేచి ఉండే సహనాన్ని కూడబెట్టుకుంటోంది. పూర్ణకుంభంపైన కడుపుబ్బ పయిడికాయ కళ్లు పైకెత్తి చూస్తోంది ఆ వైపే. నడుములకు పసుపు నూలుతాడు వడ్డాణంలా బిగిసిన పచ్చని మడత మామిడాకు కంకణాలు ముచ్చటపడుతున్నాయి.

"ఏమర్రా ! మలిశెట్టివారు! ఆడాళ్లంతా ఏం చేస్తున్నారు? వేగిరంతెమలండి. నట్టింట మొక్క మొలిచిపోతే ఎలా? కత్తుర్లు స్నానాలు అయ్యాయి కద. పెళ్లికొడుకుని తోడ్చుకురండి. ఏమమ్మా! మామిడిభత్తుల వారు మీకు వేరే చెప్పాలా? పెళ్లికూతురు ముస్తాబు ఇంకెంతసేపు? దుకాణంకి బేరగాళ్లొస్తే సరుకు ఎంతధరకు అమ్మాలో అని అప్పుడు లెక్కలేసుకుంటున్నట్టుంది మీ వ్యవహారం చూస్తే. ముందస్తం నేను కాగితం రాసి పెట్టేనందుకే, ఏమి తడుముకోనక్కర్లేకుండా. " పురోహితుడి కంచు గొంతు ధక్క మ్రోయించింది యుద్ధ ప్రాతిపదికన.

పసుపు అలదిన మేదర పెళ్లిబుట్లతో ఇద్దరైతే తక్కిన ఆ అమ్మలక్కలు పరుగు పరుగున వచ్చి పెళ్లిపీనుని చుట్టుముట్టారు పురోహితుడికి 'ఘెరావ్' అన్నట్టు.

"నా ఊపిరాడకుండా చస్తే ఎలా? చెరోవైపు ఇద్దరు, ఆ మాత్రం ఇంగిత జ్ఞానం ఉన్న ఆడవారు అమర్చి పెడితే చాలు. తక్కిన వారు దూరంగా ఉండండి. కావలసినవి అందిద్దురుగాని 'రిలేరేసు' మళ్లే".పొరల్లోంచి వచ్చిన కంచుగొంతుకి తిరుగులేదు, గాలి ఉక్కిరిబిక్కిరి అవ్వాలే తప్ప.

పెళ్లిపీను అనవసరపు త్రొక్కిళ్ళకి ఆగ్రహించినా ఇరువైపు వియ్యంకురాళ్లు పెళ్లిపిల్లని తోడ్చుకు రావడాన్ని చూచి తమాయించుకుంది. ఎందరెందరి పెళ్లిపిల్లల స్పర్శకోసం తన జీవితాన్ని అంకితం చేసుకుందాయె. కళ్యాణ ఘడియల పడబోయే తలంబ్రాల్లోంచి రంగులేరుకునే పిల్లలు చుట్టూ చేరే ముచ్చటకోసం ఉవ్విళ్లూరుతోంది.

"మా కుంకుమబొట్టు, కళ్యాణతిలకాలు చూడండి" అంటున్నాయి పెళ్లి పిల్లల నుదుళ్లు ఆ క్రింద కళ్లకు, గోపనంగా తిలకాలు తీర్చిదిద్దిన కళా కారిణులకు లేని గర్ర వాటికి.

**"శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం**
**ప్రసన్నవదనం ధ్యాయేత్సర్వ విఘ్నోప శాంతయే"**

అని కంచుగొంతు అమ్మలక్కల 'రణగొణ' ధ్వనిని పక్కకు నెట్టి ఏక ధాటిగా సాగింది మూకలో జనాన్ని తోసుకొని తనదారి తను చేసుకున్నట్టు. కాస్త నోళ్లు మూతపడ్డాయి. పార్వతమ్మ చలువ, ప్రాణం పోయించుకొన్న నలుగుపిండి బుజ్జిగణపతి తన తల కొట్టిన శంకరయ్య పాపానికి తొలిపూజలందుకొనే పీఠాధిపతిగ ఓ విడిభాగం పసుపుముద్దలో వెలసిన బుజ్జిగణపతయ్యకు కంచుగొంతు తాను బాగా వినబడిన తృప్తి పొందింది. స్వచ్ఛతలేని మడి, స్పష్టత లేని మంత్రం కొరగానివి. తెలంగా మంగలి మంగళ వాయిద్యాలు తుమ్ములే కాదు, ఏ పెద్దల చిరాకు తిట్లనే కాదు, ఏ మంత్ర గొణుగుడునీ కప్పిపుచ్చే సాధనాలుగా రెచ్చిపోయాయి. "బాజాబజంత్రీలు దేవుడెరుగు, మమ్మల్నే వాయించేస్తున్నారు" అంటూ చంటి చెవుల్లో సుతిమెత్తని పొరలు మొర్రోమన్న ఆనోళ్లు ఎరువు తెచ్చుకొని చెప్దామంటే వాటికి మాటలింక రాలేదు.

కాస్తంత జరిగి పెళ్లిపీట పెళ్లిపిల్లల్ని కూర్చో బెట్టుకుంది. ముచ్చటగా అప్పటికే ఆసీనుడై వున్న పురోహితుడి ఎదురుగా పెళ్లిపెద్దల్ని ఆ వైపు ఈ వైపు ఎదురెదురుగా కూర్చొబెట్టు కుంది.

అవతారమెత్తినపుడల్లా లక్ష్మీనారాయణులై తనపై మోసేందుకు ఆరాటపడే భూదేవతలా వుంది. పెళ్లిపీను.

పందిరిరాటల తర్వాత రెండోవిడత మామిడాకు కంకణాలు తొట్రుపడుతూ పురోహితుడు సాయం పట్టగా మూడుజతల అరచేతుల్లోకి జారకుండ విడివిడిగా ముడిపడ్డాయి కళ్యాణ కార్యదీక్షను ఇనుమడింపజేస్తూ పురోహితుడి శ్రద్ధ మిగిలిన తంతు పూర్తిచేసింది. అవచనం జరిపించుకొన్నవారి అశ్రద్ధను మరోప్రక్క నిరసనగా ఛీంకరిస్తూనే.

"ఇక బయల్దేరండి చిత్తాలమ్మవారి గుడికి" అంది కంచుగొంతు ఆ పైన ముక్కుపుటాల్ని ఉల్లాసంగా ఊపిరి తీసుకోనిచ్చి నడుముకి బిగి కండువా పంచెలో ముదురు గోధుమరంగు ఆకృతి రెండు కాళ్లని అనుసరించింది కంచుగొంతుకి వంతగా.

"శాలువా , కాకపోతే ఇస్త్రీ దుప్పటి" అంటూ కింతలివారు పెళ్లికొడుకు మేనమామ నాలుక కదలినా పట్టేసిన గొంతుకేక చుట్టాలు పక్కాలు పరామర్శల ఘోషలో చిక్కుకుంటే-

ప్రక్కన తన 'జీన్సు' తొడుగు ఎగాదిగా చూసు కుంటూ మురిసిపోతున్న అతని జూనియర్ గొంతు మారు ఘోషించింది. అన్నయ్య పెళ్లి అవుతుండ డంతో 'లైన్ క్లియర్' అయిందంటూ తనకు పెళ్లి ప్రస్తావనల స్నేహితుల ఎకసక్కాల ఉక్కిరిబిక్కిరి నుండి తేరుకొని మలిశెట్టివారి రెండో వారసుడి గొంతు, "ఆ తెస్తున్న" అని బదులు పలికింది సరాగంగా.

తన అవసరం వచ్చేకోసం ఎదురుచూస్తున్న పెద్ద నిడివి వెడల్పాటి ఎఱ్ఱశాలువ. ఉత్తర యాత్రలకు వెళ్లినప్పుడు మలిశెట్టి వారిచేత "కులూ మనాలీ" లో కొనిపించుకొన్నది, మంత్ర ముగ్ధంగా మడత విప్పించుకొంది. నావంతు అన్నట్టు నలుపు కొత్త గొడుగు చేతికి తగిలింది.

"ఇది చిత్తాలమ్మ వారికి చూపించేందుకు ఆడపెళ్లివారిది. నేనే కొనిపెట్టి ఉంచా స్ప్రింగు, బటనుగొడుగు. పాము కుబుసం లాంటి కవర్‌లో ఖరీదైంది" అని పట్టేసిన గొంతు తిరిగి అంది. వెతగ్గా వెతగ్గా డొక్కు పాత గొడుగు ఒకటి దొరికింది. బొత్తిగా చిరిగిందైతే బాగుండదని కింతలవారి చేయి దాన్ని తడిమి చూసింది. మాసినట్టుంటే నేం గుడ్డ చిరగలేదు.

ఔత్సాహికులు, కుర్ర రెండు జతల చేతులు శాలువాని విశాలంగా విప్పి నీడ పట్టాయి. 'లైన్ క్లియర్' జూనియర్ మలిశెట్టి చేయి శాలువ క్రింద గొడుగు విప్పి పట్టుకుంది. అవుతున్న వదిన, అన్నయ్యని గొడుగులోకి చేర్చింది. పెళ్లైన ఆడపడుచు చేతి పళ్లెరంలో విస్తరాకు మూతలోంచి అన్న భోజనం ఆవిరులు విరజల్లుతూ తన ఉనికిని తెలియజేసింది.

పూలు, పసుపు, కుంకుమ, గాజులు మొదలైన పూజా సామాగ్రి మరో ముత్తయిదువ చేతిలో వెదురు తట్టలోంచి చూస్తోంది. అసలు సిసలైన పెళ్లి నడకల్ని.

"కోడి, నల్లకోడి" అంటూ పట్టేసిన గొంతు ఘాబరాగా అంది. బిక్కు బిక్కుమంటూ నిల్చున్న పనికుర్రాడి చేతి బిగిసిన పట్టులో ఇమిడి ఉన్న కోడిపిల్ల చిన్నగా పలికింది.

ఆకాశం దారి దగ్గర పడింది, సూర్యుడు నడి నెత్తికి వచ్చేందుకు.

ఆశీస్సులు కురిపించేందుకు వెలసి ఉన్న చిత్తాలమ్మవారు పెళ్లి పిల్లల కోసం వాకిలి తెరిచే వుంచింది.

"వెనక్కి వెనక్కి " అంటూ కంచుగొంతు మళ్లీ గదిమింది, పెళ్లి పిల్లల్ని దాటి చుట్టాల మూక చిన్న గర్భగుడిలోకి చొచ్చుకు ప్రవహించేలోపల. చూస్తే ఏకంగా అమ్మవారినే ఘొరావ్ చేసేలా వుంది వారి తొట్రుపాటు.

ధూపదీప కుంకుమ అర్చనల్ని నిదర్శనం గల చిత్తాలమ్మవారు వాత్సల్యంతో పుచ్చుకుంది.

అన్నభోజనంకి తాను అమ్మ వారికి నివేదింపు అయినందుకు తృప్తిపడినట్టు తెలిపే నోటిమాట రాదు.

పెళ్లి పిల్లల చేతిలో కోడిపిల్ల ఆయాన పడిపోతోంది. ఎగిరిగంతే సేందుకు వడ్డించిన విస్తరాకు పైకి. గింజ, చీమ పురుగు తప్ప ఇలాంటి రుచిగల భోజనం దానికి దక్కబోతోంది. తీరా భోజనం కాడ సంకోచించి ఫలితం లేదు. 'ఆహారే వ్యవహారేచ త్యక్త లజ్జాసుఖీభవేత్' అన్న నానుడి దానికి తెలుసేమో. ముక్కుతో పొడిచి కరచిన అన్నం మెతుకులు నోటిలో జార్చింది బెదురుచూపుల్తో దాని కంఠం ఉబ్బి తబ్బిబ్బవుతుండగా సమయం రానే వచ్చింది.

"నేటితో నూకలు చెల్లిపోతున్నాయి" అని అనుకుంటూ కోడిపిల్ల మనస్సు ప్రాణాల్ని పొదివి పట్టుకుంది. అంతవరకు శూన్యంగా వున్న పెళ్లిపిల్ల

మనసు ఆలోచించసాగింది.

"పెళ్లయి కడుపులో ఒక ప్రాణం పోయిం చేందుకు మరో ప్రాణం తీయడం అవసరమా" మనసు తనలో తాను గొణిగింది నోటికి ఆ పని అప్ప చెప్పలేక. ఏదో దిగులు, తప్పు జరుగుతోందన్న కారణంగా.

వదులైన అరచేతి పట్టులోంచి కోడిపిల్ల చెంగున గంతేసింది ఒక్కక్షణం దాని రెండు రెక్కలు విప్పుకొని.

"దారికడ్డం, దారికడ్డం" పట్టేసిన గొంతు పెగిలింది. యమున, చంటి క్రిష్టుడుకి దారి ఇచ్చినట్టు తోపులాటలో అందరూ రెండు పాయలయ్యారు. సందు చూసుకొని కోడి తుర్రుమంది చెట్టు క్రింద కందచీమల పుట్టవైపు.

"నడవండి నడవండి" అంటూ ఆ కాస్త సమమం చప్పుడు చేయక ఊరుకున్న కంచుగొంతు మళ్లీ పలికింది.

"ఆ రావిమర్రి దంపతుల కడకు పదంది. అక్కడ పని ఇంకా వుంది" అని తరువాత కార్యక్రమాన్ని గుర్తు చేసింది.

"కందచీమలు జాగ్రత్త. దారపోగుతో చుట్టేస్తూ ప్రదక్షినలు చేయండి." కంచుగొంతు తెలిపింది ముందు జాగ్రత్తగా.

పెళ్లి పిల్లడి చేయి దారపుండ అందుకోగా పెళ్లి పిల్లచేయి అలంబనం అన్నట్టు ఆ దారాన్ని పట్టుకోగా ఇరువురి కాళ్లు ప్రదక్షినలు ప్రారంభించాయి.

పెళ్లిపిల్ల మనసు వెదకుతోంది. అక్కడే వుంది కోడిపిల్ల. కంద చీమల్ని ఏరుకుంటోంది, తల్లికోడి చీమల్ని ఒక్కొక్కటే ముక్కుతో పొడిచి తినడం మొదట నేర్పినట్టుగా.

నల్లకోడిని ఒడిసి పట్టుకొని పట్టుకుపోయేందుకు ఏవో రెండు చేతులు చాస్తూ దాని దగ్గరకు చేరితే పట్టేసిన గొంతు,ఆశ్చర్యం,ఈసారి స్పష్టంగాపలికింది.

"ఇది చిత్తాలమ్మకు పెంపకం. రివాజు, ఏ నోటికి బలి కాకూడదు."

పెళ్లిపిల్ల మనసు ఉత్సాహంగా ఈసారి ఊహలకు పోవడమే కాక నోటికి స్వేచ్ఛనిచ్చింది స్నేహితు రాంౘ్రతో మారుపలికేందుకు.

దారపుండ అయిపోయింది. ★

## నాకు కవిత్వం సామాజిక సంస్కారం !!

### రాధేయ

మనిషి గాయపడుతూంటే
కవికి నిద్రపట్టదు
నానా రుచి రార్ధ సూక్తి నిధులన్నీ
చిక్కనవుతున్న దు:ఖంలోకి
ఇమిడి పోతూంటే
కవిత్వం క్షతగాత్రం కాక తప్పదు
పంట గింజల్ని అన్నం మెతుకులుగా
మార్చలేని నిస్సహాయ స్థితిలో
పనిముట్లన్నీ జీవన భృతిని
కోల్పోతున్నప్పుడు
కవి గాయపడక తప్పదు!
మొలకెత్తే ఉత్సాహమంతా
ముళ్లమీద ఆరేయ బడుతూంటే
మొగ్గ తొడిగే బాల్యం
దిగులు కొక్కనికి వేలాడుతోంటే
నా కవిత్వం
అందమైన అమ్మాయి అరచేతిలోని
గోరింటలా పండుతుందా?
సంక్షోభాల్ని జయించాల్సిన వాడు
సాగిల పరి మొక్కుతున్నాడు
కరుణా వాత్సల్యాలే
కనుమరుగై పోతూంటే
నా కవిత్వం పగిలిన వేణువులోంచి
భగ్నరాగమై పల్కుతుంది
ప్రేమాభిమానాలకు డాలర్ మైకం కమ్మేసింది
దయా రహిత ప్రపంచం ఇంటర్‌నెట్‌లో
స్థిరపడుతోంటే
నా కవిత్వం శిల్ప నైపుణ్యం చిక్కబడదు
ఇవాళ మనిషి చుట్టూ అభద్రతా వలయాలు
వస్తు వ్యామోహాలు వెన్నంటి తరుముతూంటే
నా కవిత్వం అప్పుడే చిలికిన మీగడపెరుగులా
కమ్మటి వాసన రాదు
నాకు కవిత్వమంటే-
ఒక సామాజిక సంస్కారం
ద్రోహ చింతనపై ధిక్కారస్వరం!